క్లుప్తంగా

కడప ఆర్డీఓగా జాన్ ఇర్విన్


కడప ఆర్డీఓగా బాధ్యతలు స్వీకరిస్తున్న జాన్ ఇర్విన్

కడప కోటిరెడ్డి సర్కిల్: కడప రెవెన్యూ డివిజనల్ అధికారిగా జాన్ ఇర్విన్ పాలపర్తి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ ఆర్డీఓగా పనిచేస్తున్న మధుసూదన్‌రావును విజయవాడకు బదిలీ చేశారు. ఇటీవల చేపట్టిన బదిలీల్లో ప్రకాశం జిల్లా కనిగిరి ఆర్డీఓగా పనిచేస్తున్న జాన్ ఇర్విన్‌ను కడప ఆర్డీఓగా బదిలీ చేశారు. ఈ మేరకు ఆయన కడపకు చేరుకుని బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన కలెక్టర్ శివశంకర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పలు అంశాలపై చర్చించారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయ సిబ్బంది నూత న అధికారిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

అన్నదానం

కడప కార్పొరేషన్: మిలాద్ ఉన్ నబీ సందర్భంగా స్థానిక 30వ డివిజన్‌లోని మంజుమియా పార్క్ గుంత బజార్ సమీపంలో కార్పొరేటర్ ఎస్ఎండీ షఫీ, ఖాదర్ ఖాన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 22 సంవత్సరాల నుండి బార్మీ సందర్భంగా గుంతబజార్ యూత్, యువకులంతా కలిసి ఇక్కడ అన్నదాన కార్యక్రమం చేయడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు వలీవుల్లా హుస్సేనీ, రసూల్ ఖాన్, యూనుస్ బాష, వసీం, హుస్సేన్ ఖాన్, మస్తాన్, కాజా, నూర్, చంద్ర, శేఖర్ పాల్గొన్నారు.

రైలు పట్టాల వద్ద మృతదేహం


మృతదేహాన్ని పరిశీలిస్తున్న రైల్వే పోలీసులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప రైల్వేస్టేషన్–కృష్ణాపురం రైలు మార్గంలోని రైల్వే ట్రాక్ పక్కన గుర్తు తెలియని మృతదేహం గుర్తించామని రైల్వేపోలీసులు తెలిపారు. మృతుని వయస్సు 35–40 సంవత్సరాల మధ్య ఉంటుందని, తెలుపు, బ్లూ, లైట్ బ్లూ నిలువు అడ్డుగీతలు కలిగిన ఫుల్ హ్యాండ్ షర్టు ధరించి ఉన్నాడన్నారు. షర్టు లోపల లైట్ బ్లూ ఫుల్ షర్టు, దానిపై నలుపు తెలుపు డిజైన్ ఉందన్నారు. షర్టుపై ఫేమస్ వేర్ టైలర్స్, వైఎం పల్లె, కడప అనే లేబుల్ ఉందన్నారు. ఎరుపు, పసుపు, నలుపు డిజైన్లుగల బ్లూ లుంగీ ధరించి ఉన్నాడన్నారు. మెడలో తాయత్తు ఉందన్నారు. మృతునిస్థితిని బట్టి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలియవస్తోందన్నారు. మృతుని ఆచూకీ తెలిసిన వారు కడప రైల్వేపోలీసుస్టేషన్ ఎస్ఐ శ్రీనివాసరావు (సెల్ నెంబరు 94409 00811)కు తెలియజేయాలని కోరారు.

విద్యార్థులు నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలి

ఏఎఫ్‌యూ: విశ్వవిద్యాలయ విద్యార్థులు నైపుణ్యాలను అందిపుచ్చుకుని తాము అభ్యసించే కోర్సుల్లో నిష్ణాతులుగా తయారుకావాలని డాక్టర్ వైఎస్‌ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య జి. విశ్వనాథకుమార్ సూచించారు. డా. వైఎస్‌ఆర్ ఏఎఫ్‌యూ, విజయవాడ స్కూల్‌ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ కళాశాల మధ్య కుదిరిన ఎంఓయూలో భాగంగా విద్యార్థులు విజయవాడలో శిక్షణ పొందుతున్నారు. శుక్రవారం ఏఎఫ్‌యూ వీసీ శిక్షణ పొందుతున్న ఏఎఫ్‌యూ విద్యార్థుల వద్దకు వెళ్లి వారి యోగ క్షేమాలు కనుక్కోవడంతో పాటు జరుగుతున్న శిక్షణ గురించి అడిగి తెలుసుకున్నారు.

వైవీయూ వీసీ, రిజిస్ట్రార్‌లను తొలగించాలంటూ నిరసన


వైవీయూ ముఖద్వారం వద్ద నిరసన తెలుపుతున్న ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ నాయకులు

వైవీయూ: యోగివేమన యూనివర్సిటీ వీసీ కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ తప్పెట రాంప్రసాద్‌రెడ్డిలను తొలగించాలంటూ విద్యార్థి సంఘాల నాయకులు శుక్రవారం నిరసన తెలిపారు. యోగివేమన విశ్వవిద్యాలయం ముఖద్వారం వద్ద ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ నాయకులు కళ్లకు గంతలు కట్టుకుని ఆందోళన చేపట్టారు. ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వి.గంగాసురేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జి. వలరాజు మాట్లాడుతూ లైంగిక ఆరోపణలు ఉన్న వారికి విశ్వవిద్యాలయంలో ఉన్నత పదవులు కట్టబెట్టాలంటూ జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు సిఫార్సు చేయడం ఏంటని ప్రశ్నించారు. ఇలాంటి ఆరోపణలు ఉన్నవారిని ఉన్నత పదవుల్లో కూర్చోబెట్టడం ద్వారా ఎలాంటి సందేశాన్ని ప్రభుత్వం ఇవ్వదలచిందని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె. శివశంకర్, ఉపాధ్యక్షుడు చంద్ర, నాయకులు గణేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

గురుదేవుళ్లకు వందనం

అన్నింటి కంటే ఉపాధ్యాయ ఉద్యోగం ప్రత్యేకం. పిల్లలను భావి పౌరులుగా ఉన్నతంగా తీర్చిదిద్దగలిగే శక్తి ఒక్క టీచర్‌కే ఉంటుంది. కొందరు గురువులు నిబద్ధతతో తమ వృత్తికే వన్నె తెస్తున్నారు. వారు చేస్తున్న కృషికి పలు అవార్డులు వరించాయి. ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. నేడు అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం నేపథ్యంలో సాక్షి అందిస్తున్న ప్రత్యేక కథనం. – కడప ఎడ్యుకేషన్

ఆరేళ్ల సర్వీసులో ఒక్క సెలవు పెట్టకుండా..


హెచ్ఎం నాగమణి

ఆరు సంవత్సరాలలో ఒక్క సెలవు కూడా పెట్టకుండా విద్యాబోధనలో నిమగ్నమవడం అంటే అస్సలు ఊహించలేం కదా.. ఆ ఊహను నిజం చేసి చూపించారు కడప నగరపాలక ఉన్నత పాఠశాల మెయిన్ హెచ్ఎం నాగమణి. అంకిత భావానికి నిదర్శనంగా నిలిచిన ఆమె తాను చదివిన పాఠశాలకే హెచ్ఎం కావడం మరో విశేషం.

- నాగమణి కడప నగరంలో 8, 9, 10వ తరగతులను నగరపాలక ఉన్నత పాఠశాల మెయిన్‌లో చదువుకుంది. తరువాత ఇంటర్‌ను కడపలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో చదువుకుంది. డిగ్రీ, పీజీలను ఓపెన్‌లో పూర్తి చేసింది. 2002లో ఉపాధ్యాయ ఉద్యోగం పొంది కడప నగరంలోని 16వ వార్డులోని ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జీటీగా చేరింది. తరువాత 2012లో పదోన్నతిపై సోషియల్ సబ్జెక్టు స్కూల్ అసిస్టెంట్‌గా గాంధీ నగర్ ఉన్నత పాఠశాలకు వచ్చింది. ఆ తరువాత 2017లో పదోన్నతిపై ప్రధానోపాధ్యాయురాలిగా మున్సిపల్ హైస్కూల్ మెయిన్‌కు వచ్చింది. ప్రస్తుతం ఆ స్కూల్లో దాదాపు 1400 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.

బోధన.. సామాజిక సేవ..


సాధించిన అవార్డులు, ప్రశంసాపత్రాలతో మునీమ్

మహమ్మద్ మునీమ్. ఈయన చింతకొమ్మదిన్నె మండలం ఉర్దూ జెడ్పీ హైస్కూల్ బయలాజికల్ టీచర్‌గా పనిచేస్తున్నారు. ఈయన తరగతి గదికే పరిమితం కాకుండా వివిధ సామాజిక, సాహిత్య, సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ శభాష్ అనిపించుకుంటున్నారు. తాను పనిచేసే పాఠశాలలో సొంత నిధులతో విద్యార్థులకు విద్యా సామాగ్రిని సమకూర్చడం, దుస్తులను పంపిణీ చేయడం, భాషాభివృద్ధికి తోడ్పాటు అందించడం వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా స్వాతంత్ర సమరయోధుల జయంతి, వర్ధంతులను క్రమం తప్పకుండా నిర్వహిస్తూ.. విద్యార్థులలో వారిపై అవగాహన పెరిగేలా వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించి ప్రతిభచాటిన వారికి బహుతులను అందచేస్తూ ప్రోత్సహిస్తున్నారు. కవుల జన్మదినాలను పురస్కరించుకుని కవితాగోష్టి నిర్వహించి విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. విద్యార్థులకు ఉచితంగా వైద్య శిబిరాలను, దంత వైద్య శిబిరాలను నిర్వహించి ఉచితంగా మందులను అందజేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

నాడు ముగ్గురు.. నేడు 103 మంది..


విద్యార్థుల కోసం అందుబాటులో ఉంచిన వివిధ రకాల పుస్తకాలు


పిల్లలకు నైట్ ట్యూషన్ చెబుతున్న గానుగపెంట రమణారెడ్డి

కాశినాయన మండలం పిట్టిగుంట మండల ప్రాథమికోన్నత పాఠశాలలో 2017లో కేవలం ముగ్గురే ముగ్గురు పిల్లలు ఉండేవారు. ప్రస్తుతం 103 మంది విద్యార్థులున్నారు. ఇదంతా ఆ పాఠశాలలో సోషియల్ టీచర్‌గా పనిచేస్తున్న గానుగపెంట రమణారెడ్డి విశేష కృషి. చక్కటి విద్యా బోధనతో పిల్లలను ఆకట్టుకున్నారు. సొంత డబ్బు రూ. 3 లక్షలు వెచ్చించి లైబ్రరీ బుక్స్, గణితం, ఇంగ్లీష్, సైన్స్, తెలుగు పుస్తకాలు, ప్రాజెక్టర్, లాప్‌టాప్, స్మార్ట్ టీవీలు, ఆట వస్తువులు.. ఇలా రకరకాల బోధనోపకరణాలు ఏర్పాటు చేశారు. డైలీ పరీక్షల నిర్వహణకు ప్రింటర్, ఆన్‌లైన్ క్లాసుల కోసం 2018లోనే స్మార్ట్ టీవీని కొనుగోలు చేశారు.

- విద్యార్థులకు ముఖ్యమైన సబ్జెక్టులైన గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ బోధించడానికి సొంతంగా ముగ్గురు వాలంటీర్లను ఏర్పాటు చేసి ఒక్కొక్కరికి నెలకు రూ. 5 వేల చొప్పున చెల్లిస్తూ విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నారు.
- ప్రతి ఏడాది సొంత డబ్బు వెచ్చించి వేసవిలో సమ్మర్ క్యాంపు ఏర్పాటు చేసి విద్యార్థులకు ఇంగ్లీష్ నిపుణులతో సబ్జెక్టు బోధిస్తున్నారు.
- ఇప్పటికీ చదువులో వెనుకబడిన వారికి ప్రతి రోజు సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు శిక్షణ ఇస్తున్నారు. ఈయన సేవలకు 2015లో ప్రభుత్వం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు, 2022లో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుతో సత్కరించింది.

ఎంతో సంతృప్తి




నన్ను నమ్ముకుని పాఠశాలకు వచ్చే పేద పిల్లలకు విజ్ఞానాన్ని అందజేయడమే లక్ష్యం. ఆరేళ్ల నుంచి సొంత నిధులతో ముగ్గురు వాలంటీర్లను పెట్టి బోధన సాగిస్తున్నా. ప్రతి రోజు సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు మా పిల్లలకు ఉచితంగా బోధన చేస్తున్నా. సొంత డబ్బుతో పాటు దాతల సాయంతో బడికి కావాల్సిన సామగ్రి, పుస్తకాలు కొని విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్నా. చాలా సంతృప్తిగా ఉంది.

– గానుగపెంట రమణారెడ్డి, సోషియల్ టీచర్, పిట్టిగుంట, కాశినాయన మండలం

గణితం.. చాలా సులభంగా..



పాఠశాల ఆవరణంలో ఏర్పాటు చేసిన మ్యాథ్స్ నమూనాలు


మొర్రాయిపల్లె పాఠశాల కటాంజనానికి ఏర్పాటు చేసిన అబాకస్

మైనపురెడ్డి నాగలక్ష్మీదేవి గణిత ఉపాధ్యాయురాలు. ఈమె ఎక్కడ పనిచేసినా ప్రత్యేక బోధనతో విద్యార్థులను ఆకట్టుకుంటున్నారు. గణితం అంటే పిల్లలలో భయం పోగొట్టి ఇష్టం పెంచేలా తర్ఫీదు ఇస్తున్నారు. వారికి సులభంగా అర్థమయ్యేలా చదువు చెబుతున్నారు. ఈమె చాపాడు మండలం మొర్రాయపల్లె ప్రాథమిక పాఠశాలలలో గతంలో ప్రధానోపాధ్యాయురాలిగా పనిచేసేవారు. ప్రస్తుతం మైదుకూరు మండలంలోని సుంకులుగారిపల్లెలోని ఎంపీయూపీ స్కూల్‌లో పనిచేస్తున్నారు. మొర్రాయిపల్లెలో పనిచేసే సమయంలో నాడు–నేడు పనుల్లో భాగంగా చేపట్టిన పనులలో పాఠశాల ఇనుప కటాంజనాలలో అబాకస్, భిన్నాలు, ఆరోహణ, అవరోహణ క్రమాలను అమర్చేలా చేసింది. అలాగే ఫ్లోరింగ్, చెట్ల పాదులకు గణిత ఆకారాలను అమర్చేలా పనులు చేయించారు. వీటితో పాటు రోజూ బోధనలో సులభంగా మ్యాథ్ సబ్జెక్టు పట్ల పిల్లలలో ఆసక్తిని పెంచారు.

- నూతన బోధన పద్ధతులపై 2022–23లో జాతీయస్థాయిలో నిర్వహించిన ఇన్నోవేటివ్ పెడగాజి పోటీల్లో ఆంధ్రప్రదేశ్ నుంచి మొరాయిపల్లె ప్రాథమిక పాఠశాల అత్యుత్తమ స్థానాన్ని దక్కించుకుంది. విద్యా అమృత్ మహోత్సవ్ 2022–23లో భాగంగా విద్యా మంత్రిత్వశాఖ, కేంద్ర సీఐఈటీ, ఎన్‌సీఈఆర్‌టీ సంయుక్తంగా ఇన్నోవేటివ్ పెడగాజి అంశంపై పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో మైనపురెడ్డి నాగలక్ష్మీదేవి రూపొందించిన ప్రాజెక్టు జాతీయస్థాయిలో మొదటి స్థానంలో నిలిచింది.

కష్టమైన సబ్జెక్టును ఇష్టంగా..



నేను పాఠశాలలో జరిగిన నాడు– నేడు పనులలో పిల్లల బోధనకు అనుకూలంగా మ్యాథ్స్‌కు సంబంధించిన నమూనాలను రూపొందించాను. వాటితో పాటు పిల్లలకు మ్యాథ్స్ సబ్జెక్టు అంటే భయం పోగొట్టేలా సులభ పద్ధతులు బోధన చేశాను. నాకు చాలా సంతృప్తిగా ఉంది.

– మైనపురెడ్డి నాగలక్ష్మీదేవి, ఉపాధ్యాయురాలు

కరుణించు తల్లీ.. కనకదుర్గమ్మా..

కడప కల్చరల్ : శరన్నవరాత్రి ఉత్సవాల శోభతో కడప నగరం కళకళలాడుతోంది. సాయంత్రం 6.00 గంటల నుంచి ఆలయ సమీపంలోని వీధులన్నీ మహిళా భక్తులతో కళకళలాడాయి. కరుణించు తల్లీ కనకదుర్గమ్మా....మా ఇలవేల్పు నీవేనమ్మా...మా ఇడుములు నీవే తీర్చాలమ్మా...అంటూ భక్తులు అమ్మవారిని మనసారా ప్రార్థించారు. కడప నగరంలోని అమ్మవారి ఆలయాలన్నీ భక్తుల సందడితో కనిపించాయి.


చిన్న శేష వాహనంపై కొలువుదీరిన కడప రాయుడు


శ్రీ రాజరాజేశ్వరీదేవిగా నడివీధి గంగమ్మ


శ్రీ రాజరాజేశ్వరీదేవిగా కన్యకాపరమేశ్వరీదేవి


శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో కుంకుమార్చనలో మహిళా భక్తులు


శ్రీ రాజరాజేశ్వరీదేవిగా కామకోటి కళాంబదేవి


గడ్డిబజారులో మురళీకృష్ణ అలంకారం

సమాజంలో వైద్యుల స్థానం చాలా గొప్పది

- కడప ప్రభుత్వ వైద్య కళాశాల మాజీ డైరెక్టర్ కెప్టెన్ డాక్టర్ సిద్దప్ప గౌరవ్

కడప అర్బన్: సమాజంలో వైద్యుల స్థానం చాలా గొప్పదని, అందుకే ప్రజలంతా 'వైద్యో నారాయణో హరిః' అని సంభోదిస్తారని కడప ప్రభుత్వ వైద్య కళాశాల మాజీ డైరెక్టర్ కెప్టెన్ డాక్టర్ సిద్దప్ప గౌరవ్ అన్నారు. కడప ప్రభుత్వ వైద్య కళాశాల (రిమ్స్) ఆవరణలో శుక్రవారం రాత్రి కాలేజ్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ సిద్దప్ప గౌరవ్, రిమ్స్ వైద్యాధికారులు జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంబీబీఎస్ పూర్తి చేసిన తరువాత ప్రజలకు జవాబుదారితనంగా వైద్య సేవలను నిస్వార్థంగా అందించాలన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. సురేఖ మాట్లాడుతూ ప్రజలకు సేవచేసినపుడే సార్థకత చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ బ్యాచ్‌లలో వైద్య విద్యను అభ్యసిస్తూ ప్రతిభ కనబర్చిన వారికి వివిధ డిపార్ట్‌మెంట్‌లలో గోల్డ్ మెడల్స్, ప్రశంసాపత్రాలను అందచేశారు. క్రీడా పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి, ఐఎంహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్. వెంకటరాముడు, రిమ్స్ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విజయభాస్కర్‌రెడ్డి, వివిధ విభాగాధిపతులు, వైద్యులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు. వైద్య విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.


మెడల్స్ అందుకున్న వైద్య విద్యార్థులతో అతిథులు


ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శన

కమిషనర్ సేవలు మరువలేనివి

- మేయర్ కె. సురేష్ బాబు


కమిషనర్ వైఓ నందన్‌ను సత్కరిస్తున్న మేయర్ సురేష్ బాబు

కడప కార్పొరేషన్: కడప నగరపాలక కమిషనర్‌గా వైఓ నందన్ అందించిన సేవలు ఎంతో విలువైనవని మేయర్ కె. సురేష్ బాబు అన్నారు. శుక్రవారం సాయంత్రం బదిలీపై వెళ్తున్న వైఓ నందన్‌కు ఆయన శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ వైఓ నందన్ పనిచేసింది కొద్ది కాలమే అయినా ప్రజల్లో మంచి పేరు తెచ్చుకున్నారన్నారు. సీడీఎంఏ కార్యాలయంలో డీడీగా వెళ్తున్న ఆయన కడప నగరపాలక సంస్థకు సంబంధించిన అంశాలపై సానుకూలంగా స్పందించి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మల్లికార్జున, రామలక్ష్మణ్‌రెడ్డి, డివిజన్ ఇన్‌చార్జులు లక్ష్మయ్య, డిష్ జిలాన్, ఎస్ఈ చెన్నకేశవరెడ్డి, ఏసీపీ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

– నగరపాలక ఉద్యోగులు, సిబ్బంది శుక్రవారం సాయంత్రం బదిలీపై వెళ్తున్న కమిషనర్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ రాకేష్ చంద్ర, ఏసీపీలు నాగేంద్ర, మునిరత్నం, ఎస్ఈ చెన్నకేశవరెడ్డి, ఈఈలు నారాయణస్వామి, ధనలక్ష్మి, ఆర్ఓలు కన్నయ్య, విజయ్‌భాస్కర్ గౌడ్, ఆర్ఐ విశ్వనాథరెడ్డి, సూపరింటెండెంట్ జి. శివకుమార్, డీఈలు, ఏఈలు, పాల్గొన్నారు.

కళలపై అవగాహన కల్పించాలి

- జాయింట్ కలెక్టర్ అతిథి సింగ్


కళా ఉత్సవ్ కార్యక్రమంలో పాల్గొన్న వివిధ కేంద్రీయ విద్యాలయాల విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్: భిన్న సంస్కృతులతో విలసిల్లే భారతదేశంలో ఆయా కళల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించాలని వాటిని కాపాడుకోవడం కోసం ఇలాంటి కళా ఉత్సవాలు దోహదపడతాయని జాయింట్ కలెక్టర్ అతిథిసింగ్ అన్నారు. శుక్రవారం కడప నగర శివార్లలోని సీఎం శ్రీ కేంద్రియ విద్యాలయంలో క్లస్టర్ లెవెల్ రాష్ట్రీయ ఎక్తా పర్వ్ కళా ఉత్సవ్–2024 కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కడప క్లస్టర్ పరిధిలోని కడపతో పాటు తిరుపతి, గుంతకల్, గుత్తి, రాజంపేట, వెంకటగిరి కేంద్రియ విద్యాలయాల విద్యార్థులు ఈ ఉత్సవ్‌లో పాల్గొని తమ ప్రతిభ చూపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జేసీ అతిథిసింగ్ మాట్లాడుతూ ఇలాంటి ఉత్సవాల ద్వారా విద్యార్థుల్లో ఏక్తా భారత్ అనే భావన పెంపొందిస్తుందన్నారు. రెండు రోజులపాటు జరిగే ఈ కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ ముకేష్ మీనా పర్యవేక్షించారు. విద్యార్థులు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ పోటీలలో కడపతోపాటు పలు కేంద్రీయ విద్యాలయాల విద్యార్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జేసీ అతిథిసింగ్

కడప డీఎస్పీగా వెంకటేశ్వర్లు


ఏ. వెంకటేశ్వర్లు

కడప అర్బన్: కడప డీఎస్పీ గా ఏ. వెంకటేశ్వర్లును నియమిస్తూ డీజీపీ సీహెచ్ ద్వారకాతిరుమలరావు ఉత్తర్వులు జారీ చేశారు. కాగా ఇది వరకూ కడప డీఎస్పీగా పనిచేసిన ఎం.డి షరీఫ్‌ను పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో రిపోర్ట్ చేసుకోవాలని ఆదేశాలు ఇచ్చా రు. ప్రస్తుతం కర్నూలు సీఐడీలో పనిచేస్తున్న ఏ. వెంకటేశ్వర్లు త్వరలో కడప డీఎస్పీగా విధుల్లో చేరనున్నారు.

కడప డీఎఫ్ఓగా వినీత్‌కుమార్


వినీత్ కుమార్

కడప అర్బన్: రాష్ట్రంలో వివిధ స్థాయిల్లో డీఎఫ్ఓలుగా పనిచేస్తున్న వారిలో 41 మందిని బదిలీ చేస్తూ రాష్ట్ర అటవీశాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులను జారీ చేశారు. కడప డీఎఫ్ఓగా పనిచేస్తున్న సందీప్‌రెడ్డిని పాడేరు బదిలీ చేశారు. అనంతపురం డీఎఫ్ఓగా పనిచేస్తున్న వినీత్ కుమార్‌ను కడప డీఎఫ్ఓగా నియమించారు.

పలు సంఘ నేతలు యూటీఎఫ్‌లో చేరిక


చేరిన నాయకులతో యూటీఎఫ్ నాయకులు

కడప ఎడ్యుకేషన్: కడపలోని యూటీఎఫ్ భవన్‌లో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయ కుమార్, పాలెం మహేష్ బాబు ఆధ్వర్యంలో ఇతర సంఘాలకు చెందిన పలువురు నేతలు తమ పదవులకు రాజీనామా చేసి యూటీఎఫ్‌లో చేరారు. ఇందులో భాగంగా ప్రభుత్వ గుర్తింపు పొందిన రెండు ప్రధాన ఉపాధ్యాయ సంఘాలలో జిల్లా, మండల స్థాయిలో నాయకులుగా పనిచేస్తున్న ఈరి బాల జోజి, కె.ప్రసాద్, టి.జయరాములు, ఎస్.ఆనందరావు, పి.ఎస్.వి.ప్రసాద్, బి.ప్రభాకర్, జి.బాల ఓబయ్య, ఎస్.సుమనయ్య తమ పదవులకు రాజీనామా చేసి యూటీఎఫ్‌లో చేరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ట్రెజరర్ నరసింహారావు, సహాధ్యక్షురాలు సుజాత రాణి, జిల్లా కార్యదర్శులు చెన్నయ్య, ఎజాస్ అహ్మద్, ఆడిట్ కమిటీ కన్వీనర్ ప్రభాకర్ పాల్గొన్నారు.

యువకుడు అరెస్ట్

కడప అర్బన్: కడప చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 8 సంవత్సరాల బాలికపై అత్యాచారంకు పాల్పడిన రవిశంకర్ అనే యువకుడిని శుక్రవారం అరెస్ట్ చేశారు. ఇంట్లో ఎవరూలేని సమయంలో ఆ బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. బాలిక బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదదు చేసి నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించారు.

ఫ్రీహోల్డ్ భూముల్లో అవకతవకలు

- తహసీల్దార్ సహా 14 మంది వీఆర్వోలకు నోటీసులు

కడప సెవెన్‌రోడ్స్ : మైదుకూరు మండలంలో ఫ్రీహోల్డ్ భూములపై జరిగిన అవకతవకలపై ఓ తహసీల్దార్‌తోపాటు 14 మంది వీఆర్వోలకు నోటీసులు జారీ చేసి సంజాయిషీ సమర్పించాలని ఆదేశించినట్లు జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మైదుకూరు మండలంలో ఫ్రీహోల్డ్ భూములపై వచ్చిన ఆరోపణల మేరకు రీ ఎంక్వయిరీ చేసి అక్కడ అవకతవకలు/తప్పులు జరిగినట్లు గుర్తించామన్నారు. దీంతో ఆ సమయంలో అక్కడ పనిచేసిన ఒక తహశీల్దార్, 14 మంది వీఆర్వోలపై క్రమశిక్షణా చర్యలు తీసుకొనుటకు గాను నిర్ణయించి వారి నుండి వివరణ సమర్పించాలని ఉత్తర్వులు జారీచేశామన్నారు. వారి నుండి సంజాయిషీలనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు.

టీబీ, లెప్రసీ కేసులను గుర్తించాలి

- డీఎంహెచ్ఓ డాక్టర్ నాగరాజు


మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ నాగరాజు

కడప రూరల్: టీబీ, లెప్రసీ కేసులను గుర్తించి సరైన కాలంలో వైద్య సేవలను అందించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. శుక్రవారం స్థానిక జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలోని మీటింగ్ హాల్‌లో పట్టణ, గ్రామీణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులకు టీబీ, లెప్రసీ వ్యాధులపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ సకాలంలో టీబీ, లెప్రసీ వ్యాధులను గుర్తించి తగు వైద్య సేవలను అందించాలని సూచించారు. వ్యాధిగ్రస్తుల చిరునామాలను ఏఎన్ఎంల ద్వారా ఆన్‌లైన్‌లో పొందుపరచాలని తెలిపారు. అలాగే మాతా శిశు సంరక్షణ గురించి ప్రతి గర్భిణీని ఏబీహెచ్ఏ ఐడీలో లింక్ అప్ చేయాలని పేర్కొన్నారు. హై రిస్క్ గర్భవతులను గుర్తించి వారికి అవసరమైన వైద్య సేవలను అందించాలని అన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ రవిబాబు, డీపీఎం డాక్టర్ శశిభూషణ్‌రెడ్డి, , డాక్టర్ ఉమామహేశ్వర కుమార్, ఆరిఫుల్లా తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీ రామగిడ్డయ్యకు శుభాకాంక్షలు

కడప రూరల్: వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం రీజనల్ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ రామగిడ్డయ్యను శుక్రవారం పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంబారపు అహరోన్ కలిసి, శుభాకాంక్షలు తెలిపారు. జోన్–4 ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఆ అసోసియేషన్ నేతలు పాల్గొన్నారు.